నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, ఆదివారం 27 అక్టోబర్ 2024 | MAHABUBNAGAR NARAYANPET

రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబర్ 26 : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ పట్టణ కార్యదర్శి శివప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం మహబూబ్‌నగర్‌లోని తెలంగాణ చౌరస్తాలో విద్యార్థులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావొస్తున్నా పెండింగ్ బకాయిలను చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే దిశగా కుట్ర చేస్తుందని ఆరోపించారు. డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ పూర్తి చేసిన వేలాదిమంది ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ రాని కారణంగా యాజమాన్యాలు విద్యార్థుల విద్యార్హత ధ్రువపత్రాలు, ఇతర సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఒత్తిడికి గురిచేస్తున్నాయని ఆరోపించారు.

సదస్సు స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

29న రైతు నిరసన సదస్సు

- వనపర్తిలో ఏర్పాట్లను పరిశీలించిన నిరంజన్‌రెడ్డి

వనపర్తి టౌన్, అక్టోబర్ 26 : వనపర్తిలో ఈనెల 29న నిర్వహించనున్న రైతు నిరసన సదస్సు కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి శనివారం పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని పాలకేంద్రం వద్ద ఖాళీ స్థలాన్ని బీఆర్ఎస్ నాయకులతో కలిసి నిరంజన్‌రెడ్డి పరిశీలించారు. కార్యక్రమానికి అన్ని అనుమతులు తీసుకోవాలని, రైతులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా తాగునీరు, భోజన సదుపాయాలు కల్పించాలన్నారు. సదస్సుకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు హాజరవుతున్నారన్నారు. రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, నాయకులు రమేశ్‌గౌడ్, అశోక్, రవిప్రకాశ్‌రెడ్డి, తిరుమల్, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, పరంజ్యోతి, ధర్మానాయక్, మహేశ్వర్‌రెడ్డి, నర్సింహ, శ్రీను, శాంతన్న, గిరి, జోహెబ్ హుస్సేన్, రాముగౌడ్, నాయక్, క్రాంతి, హన్మంతు, బాబునాయక్ తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త కల్లపు సతీశ్ ఇటీవల మరణించాడు. కాగా, శనివారం నిర్వహించిన దశదినకర్మ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సతీశ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అతడి తల్లిదండ్రులు, భార్యా పిల్లలను పరామర్శించారు.
- మద్దూర్ (కొత్తపల్లి), అక్టోబర్ 26

మాట్లాడుతున్న భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్

నల్లా బిల్లులు కట్టొద్దు

- భూత్పూర్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం

భూత్పూర్, అక్టోబర్ 26 : కేసీఆర్ ప్రభుత్వం ప్రతి ఇంటికీ ఉచితంగా నల్లా కనెక్షన్ ఇచ్చి మున్సిపాలిటీ పరిధిలో నల్లా బిల్లులు లేకుండా నీళ్లను సరఫరా చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజల నుంచి నల్లా బిల్లులను వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నదని మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ విమర్శించారు. శనివారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో చైర్మన్ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. నల్లా బిల్లులు వసూలు చేయకూడదని కౌన్సిల్ సమావేశంలో తీర్మానించారు. అదేవిధంగా ఇంటి ట్యాక్స్ ఎక్కువగా వసూలు చేస్తున్నట్లు పలువురు కౌన్సిలర్లు ఆరోపించారు. ఇంటి పన్నును తగ్గించాలని తీర్మానం చేశారు. సమావేశంలో మేనేజర్ శంకర్‌నాయక్, ఫ్లోర్ లీడర్ శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు బాలకోటి, రామకృష్ణ, గడ్డం నాగమ్మ, కృష్ణవేణి, ఫాతిమాబేగం, కో ఆప్షన్ సభ్యులు అజీజ్, మల్లమ్మ, జాకీర్, ఏఈ పుష్ప, అకౌంటెంట్ ఇందిర, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

అయిజ అంబేద్కర్ చౌక్‌లో వాహనాలు నిలిపి ఆందోళన చేస్తున్న రైతులు

మార్కెట్‌లో సదుపాయాలు కల్పించాలని..

- అయిజలో మున్సిపల్ సిబ్బందితో రైతుల వాగ్వాదం

అయిజ, అక్టోబర్ 26 : పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో కూరగాలయ క్రయవిక్రయాలు జరుపుకోవాలని మున్సిపల్ సిబ్బంది వాహనాలు నిలుపడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. అయిజ పట్టణంలో టీయూఎఫ్‌ఐడీసీ, ఎస్ఎఫ్‌సీ, గ్రాంట్‌తో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం రూపుదిద్దుకున్నది. శనివారం నుంచి ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లోనే కూరగాయల క్రయవిక్రయాలు జరుపుకోవాలని సుదూర ప్రాంతాల నుంచి రైతులు తీసుకొచ్చిన కూరగాయల వాహనాలను అడ్డుకొని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు మున్సిపల్ సిబ్బంది తరలించారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో సౌకర్యాలు లేవని, ట్రాఫిక్ సమస్య అవుతుందని, వ్యవసాయ సబ్ మార్కెట్‌లోనే క్రయవిక్రయాలు చేస్తామని మున్సిపల్ సిబ్బందితో రైతులు వాగ్వివాదానికి దిగారు. రోడ్డుపై వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు కూరగాయల వాహనాలను వ్యవసాయ సబ్ మార్కెట్‌కు తరలించాలని రైతులకు సూచించారు. ఇప్పటికే మున్సిపల్ చైర్మన్ దేవన్న, మున్సిపల్ సిబ్బంది ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో క్రయవిక్రయాలు జరుపుకోవాలని ఏజెంట్లు, రైతులకు అవగాహన కల్పించారు. సౌకర్యాలు కల్పించడంతోపాటు వాహనాల రద్దీకి అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని ఏజెంట్లు, రైతులు మున్సిపల్ అధికారులను కోరారు.

అటవీభూములు ఆక్రమిస్తే చర్యలు

ఫారెస్ట్ సిబ్బంది, గిరిజనుల వాగ్వాదం

కొల్లాపూర్, అక్టోబర్ 26 : అటవీ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవని, అడవులు అంతరిస్తే పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందని కొల్లాపూర్ ఫారెస్ట్ రేంజర్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం కొల్లాపూర్ మండలం ఎర్రగట్టు బొల్లారం సమీపంలోని 399 సర్వే నెంబర్‌లో 1,726 హెక్టార్ల ఫారెస్ట్ భూమి ఉండగా, 10 హెక్టార్లలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ సిబ్బందికి అక్కడే సాగు చేసుకుంటున్న గిరిజన కుటుంబానికి మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకున్నది. రెండు నెలలుగా ప్లాంటేషన్ చేస్తున్న ఫారెస్ట్ భూమిలో చెట్లను కొడుతూ రెండు ఎకరాల వరకు మేనావత్ రామకృష్ణ సాగు చేస్తున్నట్లు ఫారెస్ట్ రేంజర్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తండ్రి ప్రేమకు దూరమవుతున్నారు..

నెలల తరబడి నా భర్త ఇతర ప్రాంతాల్లో విధులు నిర్వర్తించడం వల్ల పిల్లలు తండ్రి ప్రేమకు దూరమవుతున్నారు. ఎప్పుడు ఇంటికి ఫోన్ చేసినా డాడీ ఇంటి ఎప్పుడొస్తాడని అడగటమే. మాకు ఇక్కడ ఎవరూ తెలియదు. మా ఆయన డ్యూటీపై ఇతర రాష్ట్రాలకు వెళ్తే ఏదైనా ఆపద వస్తే ఆదుకునే వారుండరు. ఏక్ పోలీస్ విధానంలో సంవత్సరమా లేదా రెండేండ్లు ఒకే చోట స్థిరనివాసం ఉండేలా చర్యలు తీసుకోవాలి.
- వాణిశ్రీ

పిల్లల భవిష్యత్ నాశనమవుతున్నది..

ఏడాదిలో రెండు, మూడు ప్రాంతాలకు డ్యూటీలు మారుస్తున్నారు. ఎక్కడ ఉంటే అక్కడికి కుటుంబంతో వెళ్లాల్సి వస్తున్నది. తమ పిల్లలను ఎక్కడ చదివించాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం మాత్రం ఐదేండ్లు ఒకే చోట చదివితే లోకల్ అంటున్నది. మరి ఏడాదికి రెండు చోట్ల మా పిల్లలు చదివితే మేం ఎక్కడ లోకల్ అని చెప్పాలి. బెటాలియన్ కానిస్టేబుళ్లు అంటే పెండ్లికి పిల్లను ఇవ్వడానికి భయపడుతున్నారు.
- వైజయ

ఆపదొస్తే ఆదుకునేవారే లేరు..

నా కొడుకు ఎర్రవల్లి బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. నాకు అనారోగ్య సమస్యలున్నాయి. ఓ కన్ను బాగా కనిపించదు. కోడలితో కలిసి ఉంటున్నా. నాకు ఆరోగ్య సమస్యలు తలెత్తితే చూయించడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కోడలు, పిల్లలతో కలిసి వెళ్లాలంటే కుదరదు. నా మనవరాలు డాడీ ఎప్పుడొస్తాడని ప్రతిరోజూ దీనంగా అడుగుతుంది. ఏం చెప్పాలో తెలియని పరిస్థితి.
- ఎల్లమ్మ

మా బాధలు ఎవరికీ చెప్పకోలేనివి..

బెటాలియన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుళ్ల కుటుంబాల బాధలు ఎవరికీ చెప్పుకోలేవి. భర్త ఉద్యోగం చేస్తున్నాడనే మాటే గానీ కుటుంబానికి దూరంగా ఉంటూ పిల్లలు మనోవేదనకు గురవుతున్నారు. ఒక చోట స్థిరంగా ఉండి ఉద్యోగం చేసే పరిస్థితి లేదు. ఆపదలోనూ అండగా ఉండలేని పరిస్థితి నెలకొంది. ఏదైనా శుభకార్యానికి వెళ్తే భర్త లేని లోటు బాధగా అని పిస్తున్నది.
- అనూష

డిమాండ్లు ఇవే..

- రాష్ట్రమంతా ఒకే పోలీస్ విధానాన్ని అమలు చేయాలి.
- ఎస్సీ కార్యాలయానికి అటాచ్ చేయాలి.
- ఇతర పోలీస్ సిబ్బంది మాదిరిగా సొంత జిల్లాలో పోస్టింగ్ ఇవ్వాలి.
- కంపెనీలో మెస్‌లు ఎత్తివేయాలి.
- ఒకే చోట మూడు నుంచి ఐదేండ్లుగా స్థిరనివాసం ఉండేలా పోస్టింగ్ ఇవ్వాలి.
- ఆర్డర్లీ వ్యవస్థ రద్దు చేయాలి.
- ఏఆర్, సివిల్ కానిస్టేబుళ్ల మాదిరిగా షిఫ్ట్ సిస్టమ్‌లో విధులు అమలు చేయాలి.
- విద్యార్హతను బట్టి ఉద్యోగాల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలి.

రెండ్రోజుల కిందట ఎర్రవల్లి చౌరస్తాలో ఆందోళన చేస్తున్న టెన్త్ బెటాలియన్ సిబ్బంది భార్యలు

వెట్టి బతుకులు!

ఏడాదిలో నాలుగు చోట్లకు మార్పు

"టెన్త్ బెటాలియన్ కానిస్టేబుళ్ల మనోవేదన

- ఎర్రవల్లి వద్ద విధులు నిర్వర్తిస్తున్న 650 మంది
- పిట్టిక్, ఆర్డర్లీ పేరుతో సిబ్బందితో చాకిరీ
- ప్రమోషన్స్ వచ్చినా తీసుకోని వైనం
- గతంలో 15 రోజుల పని.. 4 రోజుల లీవ్‌లు
- ప్రస్తుతం 26 రోజులు పని.. 4 సెలవులు
- ఒకే పోలీస్ విధానం కోసం హోరెత్తిన నినాదం

గద్వాల, అక్టోబర్ 26 : ప్రభుత్వ ఉద్యోగమంటే ఎవరైనా ఎగిరి గంతేస్తారు.. కానీ 10వ బెటాలియన్ కానిస్టేబుల్ ఉద్యోగమంటేనే హడలి పోతాల్సిన దుస్థితి నెలకొన్నదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు, మూడు నెలలు భార్యాపిల్లలను వదిలి వెళ్లాల్సిందే. కుటుంబంలో ఎవరికైనా ఆపద దొచ్చినా పట్టించుకునే నాథుడుండడు. రెండు, మూడేండ్లకు ఒక పాఠశాల మారాల్సి వస్తున్నది. ఏ రాష్ట్రంలో ఎక్కడ విధులు నిర్వహించడానికి అధికారులు పంపిస్తారో తెలియని పరిస్థితి. పండుగ లేదు, పబ్బం లేదు. నిరంతరం విధులు నిర్వహించాల్సిందే. ఒకవేళ అధికారులకు ఎదురు మాట్లాడితే ఇంక్రిమెంట్ పెండింగ్. దీనికి తోడు అధికారుల ఇంట్లో వెట్టి చాకిరి. ఇదేమని ప్రశ్నిస్తే వేధింపులు. చివరికి బెటాలియన్‌లో పనిచేసే కానిస్టేబుళ్లకు పిల్లని ఇవ్వాలంటే ఆలోచించే దుస్థితి నెలకొన్నది. ఏ శాఖలో నైనా ప్రమోషన్ వస్తే జీతం తోపాటు హోదా పెరుగుతుందని అందరూ భావించారు, ఇక్కడ మాత్రం ప్రమోషన్ తీసుకోవడానికి ఇష్టపడరు.

ఎర్రవల్లి 10వ బెటాలియన్‌లో 650 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో 250 మంది హెడ్ కానిస్టేబుళ్లు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 70 మంది హెడ్‌కానిస్టేబుళ్లు మాత్రమే ఉన్నారు. వారిని సెక్యూరిటీ కోసం ఎప్పుడు ఎక్కడ విధులకు పంపుతారో తెలియదు. దీంతో వారి పిల్లలను చదివించాలంటే ఇబ్బందులు పడుతున్నారు. తమ పిల్లల చదువుకు ఏడాదిలో నాలుగు పాఠశాలలు మార్చాల్సిన పరిస్థితి నెలకొందని కానిస్టేబుళ్ల కుటుంబాలు వాపోతున్నాయి. దీంతో పిల్లల భవిష్యత్తు ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విధి నిర్వహణలో అందు బాటులో లేని కారణంగా తల్లిదండ్రులు, భార్యాపిల్లలకు ఆపద వస్తే చూసుకోలేని పరిస్థితి. కనీసం భార్య డెలివరీ సమయంలో కూడా వారి వద్ద ఉండి ధైర్యం చెప్పే పరిస్థితి లేదు. గతంలో 15 రోజులు పనిచేస్తే నాలుగు రోజులు సెలవులు ఇచ్చేవారు. ప్రస్తుతం 26 రోజులు చేస్తే నాలుగు రోజులు ఇవ్వడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరీక్ష సమయంలో సివిల్, ఏఆర్, బెటాలియన్ కానిస్టేబుళ్లకు ఒకే రకమైన పరీక్ష విధానం ఉన్నప్పుడు తమపై ఎందుకు ఇంత వివక్ష అంటూ ప్రశ్నిస్తున్నారు. వారికి ఇచ్చే వెసులుబాటు మాకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

ఎర్రవల్లి చౌరస్తాలో ఉన్న బెటాలియన్

పిట్టిక్ పేరుతో వెట్టిచాకిరీ..

హెడ్‌క్వార్టర్స్‌లో ఉండాలనుకునే వారిని ఉన్న తాధికారులు పిట్టిక్ పేరుతో వెట్టి చాకిరి చేయిస్తున్నారు. మైదానంలో గడ్డి తీయడం, గుంతలు తవ్వడం, బిల్డింగ్ కట్టడాల్లో వినియోగించుకోవడం, ఆర్డర్లీ విధానంలో అధికారుల ఇంట్లో పనిచేయడం వంటివి చేయిస్తున్నారు. వీటన్నింటినీ రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. చదువుకున్న చదువుకు చేసే ఉద్యోగాలకు ఎటువంటి పొంతన లేకుండా పోతున్నది. పండుగలకు 10రోజుల ముందే ఎవరూ సెలవు పెట్టకూడదని రూల్స్ పెడతారు. కంపెనీల్లో బెటాలియన్ పోలీసులకు అందించే మెస్ విషయంలో అక్రమాలు చోటు చేసుకుంటుండడంతో సరైన భోజనం అందడం లేదు. కంపెనీల్లో ఉండే మెస్ విధానం రద్దు చేసి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

ప్లకార్డులు ప్రదర్శిస్తున్న చిన్నారులు

ఎస్సైని సస్పెండ్ చేయాలి

- పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్

మాట్లాడుతున్న గడ్డం లక్ష్మణ్

లింగాల, అక్టోబర్ 26 : ముగ్గురు యువకులకు శిరోముండనం చేయించిన ఘటనకు బాధ్యుడై ఎస్సై జగన్‌మోహన్‌ను సస్పెండ్ చేయడమే కాకుండా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. శనివారం లింగాలకు చేరుకొని ముగ్గురు యువకులు, చుట్టుపక్కల ప్రజలతో ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. అనంతరం స్థానిక జీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 14న లింగాల పెట్రోల్ బంక్‌లో జరిగిన గొడవలో ముగ్గురు యువకులకు స్టేషన్‌లోనే శిరోముండనం చేయించడం ఎస్సై చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకోవడమేనన్నారు. వారిని స్టేషన్‌లోనే ఉంచి మూడ్రోజులపాటు చిత్ర హింసలు పెట్టి సభ్యసమాజం తలదించుకునేలా ప్రవర్తించడని ఆరోపించారు. తప్పు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలే తప్పా అవమానపర్చేలా గుండు గీయించడం సరికాదన్నారు. పోలీసు ఉన్నతాధికారులు నామమాత్రంగా చర్యలు చేపట్టడం అనుమానాలకు తావిస్తోందని దుయ్యబట్టారు. ఎస్సైని అటాచ్ చేయడం చూస్తుంటే రాజకీయ జోక్యం తోడైందని అనుమానం వ్యక్తం చేశారు. ఆయనను పూర్తిగా విధుల నుంచి తొలగించి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘునాథ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌శర్మ, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సుభాన్, ప్రధాన కార్యదర్శి బాలయ్య, కార్యవర్గ సభ్యుడు బాలయ్య పాల్గొన్నారు.

నారాయణపేటకు అభివృద్ధి అథారిటీ

- 245 గ్రామాలు, 3 మున్సిపాలిటీలతో ఏర్పాటు
- ఉత్తర్వులు జారీ చేసిన పురపాలకశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ

నారాయణపేట, అక్టోబర్ 26 : నారాయణపేట, కోస్గి, మక్తల్ మున్సిపాలిటీతోపాటు జిల్లాలోని 245 గ్రామాలతో కలిపి నారాయణపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేస్తూ జీవో 169ను మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్ శనివారం జారీ చేశారు. దామరగిద్ద మండలంలో 27 గ్రామాలు, ధన్వాడ మండలంలో 9, గుండుమాల్‌లో 10, కోస్గిలో 15, కొత్తపల్లిలో 11, కృష్ణలో 14, మద్దూరులో 17, మాగనూర్‌లో 20, మక్తల్‌లో 37, మరికల్‌లో 14, నారాయణపేటలో 24, నర్వలో 20, ఊట్కూర్ మండలంలో 27 గ్రామాలున్నాయి. జిల్లాలో 280 గ్రామ పంచాయతీలు ఉండగా, అందులో 245జీపీలకు నుడాలో చోటుదక్కగా, మరో 35 పంచాయతీలకు చోటు దక్కలేదు.

మద్దతు ధర చెల్లించాలి

- జాతీయ రహదారిపై పత్తి రైతుల నిరసన


జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన తెలుపుతున్న పత్తి రైతులు

ఊట్కూర్, అక్టోబర్ 26 : ఆరుగాలం కష్టించి పండించిన పత్తి పంటను కాటన్‌మిల్ యజమానులు నాణ్యత, తేమ శాతం పేరుతో ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారని శనివారం మండలంలోని తిమ్మారెడ్డిపల్లి తండా మారుతీ కాటన్ ఇండస్ట్రీ వద్ద రైతులు ఆందోళన చేపట్టారు. జిల్లావ్యాప్తంగా వివిధ మండలాల నుంచి రైతులు పత్తిని ఇండస్ట్రీలో అమ్ముకునేందుకు శుక్రవారం సాయంత్రం నుంచి పెద్ద సంఖ్యలో వాహనాలతో తరలివచ్చి క్యూలో నిలిపారు. రాత్రి మొత్తం ఇండస్ట్రీ పరిసరాల్లోనే రైతులు నిద్రించారు. శనివారం ఉదయం 9గంటలకు కొనుగోలు ప్రారంభించిన వ్యాపారులు నాణ్యత, తేమ శాతం పరిశీలించి గరిష్ఠ ధర క్వింటాకు రూ.7,100 ప్రకటించారు. దీంతో ఆగ్రహించిన రైతులు పేట–హైదరాబాద్ జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. వారం రోజుల నుంచి రూ.7,300 పలికిన పత్తి ధరను రైతులు పెద్ద మొత్తంలో తరలిరావడం చూసి తగ్గించడమేమిటని మిల్లు యజమానులను నిలదీశారు. వ్యాపారులు కుమ్మక్కై రైతులను దోపిడీ చేస్తున్నారని, అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని చెప్పినా ఇప్పటివరకు జిల్లాలో ఏ ఒక్క మండలంలో కూడా సీసీఐ ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదని మండిపడ్డారు. సగం అమ్ముకాలు పూర్తయినా ఇప్పటికీ పట్టించుకోక పోవడంతోనే వ్యాపారులు రైతులను నిలువూ మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఎకరాకు రూ.40వేల వరకు పెట్టుబడి పెట్టామని, తేమ పేరుతో ఇష్టానుసారంగా ధరలను నిర్ణయిస్తూ నిండా ముంచుతున్నారని వాపోయారు. గంటపాటు రైతులు నిరసన చేపట్టడంతో రోడ్డుకు ఇరువైపులా వాహనాల రాకపోకలు నిలిచి ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. విషయం తెలుసుకున్న జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్, నారాయణపేట సీఐ శివ శంకర్ ఘటనా స్థలానికి చేరుకొని ఇండస్ట్రీ యజమానులు, రైతులతో మాట్లాడి ధర్నాను విరమింప జేశారు. సోమవారం నుంచి జిల్లాలోని అన్ని కాటన్ ఇండస్ట్రీల వద్ద పత్తి కొనుగోలు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ విషయమై ఇండస్ట్రీ యజమాని కిశోర్ కుమార్‌ను ప్రశ్నించగా, అంతర్జాతీయ మార్కెట్‌లో బేల్ ధరలు తగ్గిపోవడంతో రైతులకు ఆశించిన ధరలు ఇవ్వలేకపోతున్నామన్నారు. మరోపక్క నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి రైతులు అమ్మకానికి రావడంతో ఒకేరోజు కొనుగోలు కష్టం అవుతుందని తెలిపారు.

కాటన్ మిల్లు వద్ద బారులుదీరిన పత్తి వాహనాలు

మున్సిపాలిటీగా మద్దూర్

మద్దూర్(కొత్తపల్లి) అక్టోబర్ 26 : నారాయణపేట జిల్లాలోని మద్దూర్ గ్రామపంచాయతీ మున్సిపాలిటీగా ఏర్పాటు కానున్నది. ప్రస్తుతం పంచాయతీగా ఉన్న మద్దూర్ తోపాటు సమీపంలోని 8 జీపీలను విలీనం చేస్తూ మున్సిపాలిటీగా అప్‌డేట్ చేస్తున్నట్లు శనివారం రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు వెలువడాల్సి ఉన్నది. కాగా, తమను విలీనం చేస్తూ పురపాలికగా అప్‌డేట్ చేయడాన్ని ఆయా జీపీలు ఇప్పటికే నిరసన వ్యక్తం చేశాయి. ఇటీవల కాడ వెంకటాపూర్‌కు గ్రామస్తులు జీపీగానే కొనసాగించాలని వినతిపత్రం అందజేశారు. మద్దూర్ పురపాలికగా అప్‌డేట్ అయితే అభివృద్ధి మాట అటుంచితే పన్నులు భారీగా పెరగడం, నిర్మాణాల అనుమతులకు ఎక్కువ డబ్బులు చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు. దీంతోపాటు ఉపాధి హామీ పనులకు సైతం దూరం కావాల్సి వస్తుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు.